క్లుప్తంగా

జాబ్‌మేళా విజయవంతం

జామి: మండలంలోని భీమసింగి బాలాజీ కళాశాలలో ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ వారి సహకారంతో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. ఈ మేళాకు మొత్తం 633 మంది అభ్యర్థులు హాజరుకాగా వీరిలో 237 మంది ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వెంకటరావు మాట్లాడుతూ.. చదువుతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్, కళాశాల కరస్పాండెంట్ సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

పిటీషన్ల పంపిణీ



పిటీషన్ల ప్రతులను న్యాయవాదులకు అందిస్తున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

శృంగవరపుకోట: కోర్టులో అత్యవసరంగా దాఖలు చేయాల్సిన వేర్వేరు రకాల పిటీషన్ ఫార్మాట్లను న్యాయవాదులకు శుక్రవారం పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సూరిదేముడు ఏర్పాటు చేసిన ఈ ప్రతులను ఎస్.కోట మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ బి.కనకలక్ష్మి న్యాయవాదులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచితంగా అందజేసిన పిటీషన్లు న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సచివాలయ పంచాయతీ కార్యదర్శి కల్యాణిపై దురుసుగా ప్రవర్తించిన డిజిటల్ అసిస్టెంట్ శ్రీపతిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రవికుమార్, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శిపై దాడికి ప్రయత్నించడంతో పాటు దుర్భాషలాడుతూ మనోవేదనకు గురి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన వారిలో పంచాయతీ కార్యదర్శులు కల్యాణి, సాయి గణేష్, రామకృష్ణ, బాలకృష్ణ, తదితరులున్నారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ

నెల్లిమర్ల: స్థానిక ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్) గొడౌన్లలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. గొడౌన్ గదులకు వేసిన తాళాలు, సీళ్లు పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో గొడౌన్‌ల భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. ఆయన వెంట డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, భాస్కరరావు, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఈ సీజన్‌కు నీరందేనా..?

- కాలువల్లో కానరాని తోటపల్లి నీరు
- 43 వేల ఎకరాల ఖరీఫ్ సాగు ఆయకట్టుకు గండం
- ఖరీఫ్‌పై కనీసం రివ్యూ కూడా చేయని పాలకులు
- ఆవేదనలో అన్నదాతలు



చీపురుపల్లి మండలంలోని రెడ్డిపేట సమీపంలో వర్షపు నీటితో ఉన్న తోటపల్లి కాలువ



చీపురుపల్లి మండలంలోని విజయరాంపురం సమీపంలోని తుప్పలతో నిండి ఉన్న తోటపల్లి కాలువ

చీపురుపల్లి:

ఆగస్టు నెల పూర్తయింది. ఓ వైపు వరి సాగు జోరందుకుంది. వర్షాలు చూస్తే కురవడం లేదు. అప్పుడప్పుడు తుఫాన్‌ల పేరుతో కురిసే వర్షపు నీరు ఒకటి, రెండు రోజులు కనిపించి ఎండలకు ఆరిపోతోంది. ఈ పరిస్థితుల్లో తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీరు ఎంతో అవసరం. తోటపల్లి కుడి ప్రధాన కాలువ అందుబాటులో ఉన్నప్పటికీ చూసుకోవడానికే తప్ప అందులో నుంచి ఇంతవరకు సాగుకు చుక్క నీరు రాలేదు. తోటపల్లి ప్రాజెక్ట్ వద్ద నీటిని విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఇక్కడి కాలువల్లో చూస్తే మాత్రం వర్షపు నీరు తప్ప ప్రాజెక్ట్ నీటి ప్రవాహం కనిపించడం లేదు. దీంతో చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెలిమర్ల, పూసపాటిరేగ మండలాల్లో 43,552.37 ఎకరాల్లో ఖరీఫ్ ఆయకట్టుకు గండం ఏర్పడింది. తోటపల్లి కాలువల నుంచి నీరు రాకపోయినప్పటికీ పట్టించుకునే నాథుడే లేడంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కూడా తోటపల్లి కాలువ వద్ద పూజలు చేశారు తప్ప కాలువల ద్వారా నీటి ప్రవాహం మాత్రం జరగలేదు. ఈ ఏడాది పూజలు చేయకపోయినప్పటికీ నీరు మాత్రం రాలేదు.

చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో మండలాల వారీగా ఆయకట్టు (ఎకరాల్లో) వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	కేటగిరి–1ఆయకట్టు (ఎకరాల్లో)	కేటగిరి–2 ఆయకట్టు
చీపురుపల్లి	1319.80	1158.75
గరివిడి	4296.03	2756.34
గుర్ల	9941.65	7086.05
నెలిమర్ల	5761.73	2995.19
పూసపాటిరేగ	7485.02	751.81
మొత్తం	28,804.23	14,748.14

పట్టించుకోని పాలకులు..

జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి ఎమ్మెల్యేలు, ఒక మంత్రి ఉన్నారు. ఖరీఫ్ సీజన్ రావడానికి ముందే సాగు నీరు, ఎరువులు, విత్తనాలు, తది తర అంశాలపై ముందుగానే సమీక్షించుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు కు మాత్రం రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు సాగునీరు రాకపోగా, మరో వైపు ఎరువుల కొరత వేధిస్తోంది. దీనంతటికీ పాలకుల్లో శ్రద్ధ లేకపోవడమే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వేల ఎకరాల ఆయకట్టుకు గండం..

సబ్ డివిజన్ పరిధిలో గల చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెలిమర్ల, పూసపాటిరేగ మండలాల్లో తోటపల్లి కుడి ప్రధాన కాలువ కింద 43,552.37 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ మొత్తం ఆయకట్టుకు ఖరీఫ్ సీజన్‌లో తోటపల్లి కాలువ నుంచి నీరందించాల్సి ఉంది. అయితే ఇంతవరకు తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి చుక్క నీరు రాకపోవడంతో రైతులు కాలువలు వైపు ఆశగా చూస్తున్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువలు సైతం తుప్పలతో నిండి నీరు వచ్చినా ప్రవహించేందుకు అవకాశం లేకుండా ఉన్నాయి.

అన్నదాతలకు శాపం



సాగు నీరు రావడం లేదు.. ఎరువులు లభించడం లేదు.. అన్నీ కలిపి అన్నదాతలకు శాపంగా మారుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంతవరకు కాలువల ద్వారా సాగు నీరు రాలేదు. తమ గ్రామం మీదుగా తోటపల్లి కాలువ వెళ్తున్నప్పటికీ ఫలితం లేదు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు రైతులు దమ్ములు పట్టి, ఉడుపులు వేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీరు ఎంతో అవసరం.

– ఇప్పిలి నీలకంఠం, రామలింగాపురం, చీపురుపల్లి మండలం

ఐఐటీ, నీట్ కోర్సులను సద్వినియోగం చేసుకోండి

- సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న వెంకటేష్



కళాశాలలో వసతులు పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న వెంకటేష్

చీపురుపల్లి: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు ఐఐటీ, నీట్ వంటి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర క్యాదర్శి వి.ప్రసన్న వెంకటేష్ సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఐఐటీ, నీట్ ఇంటర్మీడియట్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ల్యాబ్స్, మెస్, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా సమన్వయకర్త ఎస్.రూపవతి, స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాణీశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ధీకరణ పనుల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...



విద్యుద్ధీకరణ పనులు పర్యవేక్షిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ స్వరూపకుమారి

చీపురుపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ కళాశాలల బాలుర వసతి గృహంలో జరుగుతున్న విద్యుద్ధీకరణ పనులను ఏఎస్‌డబ్ల్యూఓ వీఎల్ ఎం.స్వరూపకుమారి శుక్రవారం పరిశీలించారు. వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుద్ధీకరణ పనులకు సంబంధించి ఈ నెల 27న 'వసతి గృహంలో నాసిరకం పనులు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు ఏఎస్‌డబ్ల్యూఓ స్వరూపకుమారి పరిశీలించి, సంబంధిత ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక వసతిగృహ సంక్షేమాధికారి మంగళగిరి శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు పోరలిలో రక్తదాన శిబిరం

దత్తిరాజేరు: మండలంలోని పోరలి మెడికల్ షాపు వద్ద సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి చెందిన ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు రక్తాన్ని సేకరిస్తారని.. యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం



సిబ్బందిని సన్మానిస్తున్న కెల్ల ప్రజాప్రతినిధులు

గుర్ల: మండలంలోని కెల్ల సచివాలయంలో పనిచేసిన చంద్రకళ, సరస్వతి, చందన, ప్రేమ్‌కుమార్ ఇటీవల బదిలీ అయ్యారు. వీరిని కెల్ల సచివాలయం వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించా రు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్ల లక్ష్మి , వైస్ సర్పంచ్ కొంచాడ ఈశ్వరరావు, కెల్ల సురేష్, కెల్ల అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ , వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

బస్సు ఎక్కలేకపోతున్నారు..

- ఫ్రీ బస్సు వల్ల విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



అలమండ సంత వద్ద బస్సు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

జామి: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. దీంతో విద్యార్థులు బస్సులు ఎక్కలేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా విజయగనరం – అనకాపల్లి బస్సులు ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయి. ఈ క్రమంలో మహిళలకు ఫ్రీ కావడంతో మరింత రద్దీగా నడుస్తున్నాయి. దీంతో ఈ రూట్‌లో విద్యార్థులు బస్సులు ఎక్కలేకపోతున్నారు. ఒకవేళ ఎంతో కష్టపడి ఎక్కినా ఫుట్‌బోర్డుమీదే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో విజయనగరం, భీమసింగి, అలమండ మీదుగా కొత్తవలసకు బస్సులు ఎక్కువగా ఉండేవి. అయితే ఈ రూట్‌లో విజయనగరం–కొత్తవలస ట్రిప్పులు రద్దు చేయడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. అలమండ, అలమండ సంత, భీమసింగి, తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు నిత్యం జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఎస్.కోట, జామి మీదుగా విజయగనరం వెళ్లే బస్సులు కూడా అరకొరగా ఉన్నాయి. దీనికి తోడు మహిళల తాకిడి ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు ట్రిప్పులు నడపాలని పలువురు కోరుతున్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాధారాణి

బొండపల్లి: మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రాధారాణి తెలిపారు. మండలంలోని గిట్టుపల్లి గ్రామంలో మామిడి రైతులకు ఉద్యానవన శాఖాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..చెట్ల కొమ్మలను కత్తిరించడం ద్వారా కొత్త కొమ్మలు వచ్చి అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, ఉద్యానవన శాఖాధికారి దీప్తి, జెడ్పీటీసీ సభ్యుడు బండారు బాలాజీ, నాయకులు, కర్రి కృష్ణ, ఏట మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పూత, పిందెలను కాపాడుకోవాలి

గంట్యాడ: మామిడితోటల్లో పూత, పిందెలను కాపాడుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చునని నూజివీడు మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కె. రాధారాణి అన్నారు. మండలంలోని రామవరం సచివాలయంలో మామిడి పంటపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యం, కోత ముందు, అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి సీహెచ్.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భూములు వెనక్కి ఇవ్వాలి..



బడుగు, బలహీన వర్గాల నుంచి భూములు లాక్కుని జిందాల్‌కు కట్టబెట్టేందుకు నాడు జారీ చేసిన జీఓ 14ను రద్దు చేసి ఆ భూములను రైతులకు తిరిగి అప్పగించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా బొడ్డవర జంక్షన్‌లో నిర్వాసితులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు.

– శృంగవరపుకోట

అన్నదానం



చీపురుపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

– చీపురుపల్లి

ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు

తేనెలూరె తెలుగు భాషా మాధుర్యాన్ని.. క్రీడలను ప్రతి ఒక్కరూ ఆస్వాదించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు చేసిన సేవలను ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు. అలాగే హాకీలో ఎంతో రాణించి ఎందరో క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచిన ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట : చందులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పిరమిడ్ ఆకారంలో విద్యార్థుల విన్యాసం



శృంగవరపుకోట: తెలుగుతల్లి, రామ్మూర్తి పంతుల వేషధారణలో విద్యార్థులు



జామి: కుమరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది



గరివిడి: వెటర్నరీ కళాశాలలో మాతృ భాషా, క్రీడా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో జాతీయ క్రీడల సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు



వేపాడ: బొద్దాం పాఠశాలలో గిడుగు, ధ్యాన్యచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం



శృంగవరపుకోట: కొట్టాం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడు నెక్కల గోపిని సన్మానిస్తున్న హెచ్‌ఎం రామ్‌కుమార్



గరివిడి ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు



లక్కవరపుకోట : జ్యోతిబాపూలే పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గిడుగు రామ్మూర్తి పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్లు అప్పలరాజు, శ్రీనివాసరావు



మెరకముడిదాం: చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం రాంబాబు



వేపాడ: ఆదర్శ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థినుల కోలాటం

చెరువును తలపిస్తున్న రోడ్డు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



సగం వరకు వేసిన సీసీ రోడ్డు

గజపతినగరం రూరల్: కూటమి ప్రభుత్వం హయాంలో రహదారుల పనులు అరకొరగా సాగుతున్నాయి. మధుపాడలో సగభాగం రోడ్డు వేసి మిగిలిన సగభాగం వదిలేశారు. దీంతో గ్రామానికి వచ్చేపోయే వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఏమాత్రం వర్షం కురిసినా రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రోజ్‌లీనా వద్ద ప్రస్తావించగా.. విషయా న్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ముగ్గురి అరెస్ట్

వేపాడ: మండలంలోని వల్లంపూడి పోలీస్‌స్టేషన్ సిబ్బందిపై దౌర్జన్యం చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి శుక్రవారం కొత్తవలస కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం గస్తీకి వెళ్లిన వల్లంపూడి ఏఎస్సై నాగేశ్వరరావు, కానిస్టేబుల్ అప్పలనాయుడుపై బక్కునాయుడుపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులు శీర అచ్చిబాబు, శీర అప్పారావు, కోన గణేష్‌లను ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు